ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

- వర్సిటీ విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల పథకాన్ని పునరుద్ధరించాలి
- బీసీ విద్యార్థి మహాసభలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

ఓయూలో జరిగిన బీసీ విద్యార్థి మహాసభలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 5: ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వర్సిటీ విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా బీసీ విద్యార్థి మహాసభను నిర్వహించారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుల్ మెస్ చార్జీలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులపై భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని అన్నారు. రాష్ట్రంలో 300 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉంటే ఒక్కదానికి కూడా సొంత భవనం లేదని గుర్తు చేశారు. కళాశాల హాస్టల్ విద్యార్థులకు బస్ పాస్, ఇతర చిల్లర ఖర్చులకు ప్రతి ఒక్కరికి నెలకు బాలికలకు రూ.1000, బాలలకు రూ.800 పాకెట్ మనీ మంజూరు చేయాలని అన్నారు. అన్ని ప్రొఫెషనల్ కోర్సులు, ఇంటర్మీడియల్ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కోర్సుల ఫీజుల గరిష్ట పరిమితి ఎత్తివేయాలని కోరారు. ఫీజు బకాయిలను తక్షణమే ఒకేదఫా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా 150 బీసీ కళాశాలల హాస్టళ్లు మంజూరు చేయాలని అన్నారు. ప్రతీ హాస్టల్‌కు కంప్యూటర్లు సమకూర్చాలని చెప్పారు.

మేడ్చల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- స్నేహితుడి భార్యను పరామర్శించడానికి వెళ్తుండగా ఢీకొన్న లారీ
- దంపతులు, కూతురు మృతి.. కుమారుడికి తీవ్ర గాయాలు

బుల్లబ్బాయి, లావణ్య, కూతురు హర్షిత(ఫైల్)

మేడ్చల్, జనవరి 5 : మేడ్చల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తుండగా మృత్యురూపంలో దూసుకొచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు, కూతురు మృతి చెందగా, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లాకు చెందిన సాగి బుల్లబ్బాయి(37), సాగి లావణ్య(32) దంపతులకు సాగి హర్షిత(8), సాగి సిద్ధేశ్వర్(6) సంతానం. ఉపాధి నిమిత్తం ఈ దంపతులు హైదరాబాద్‌కు వచ్చి ఉప్పల్‌లో నివాసం ఉంటున్నారు. బుల్లబ్బాయి వాహనంపై ఇడ్లీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా.. మేడ్చల్ మండలం, ఎల్లంపేట గ్రామంలో నివాసం ఉంటున్న స్నేహితుడి భార్య చేయి విరగగా పరామర్శించేందుకు ఆదివారం తన టీవీఎస్‌ఎక్స్‌ఎల్‌పై భార్యా పిల్లలతో కలిసి బుల్లబ్బాయి బయల్దేరాడు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామికవాడ వద్దకు రాగానే.. వెనక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో వారు కిందపడగా..పైనుంచి లారీ చక్రాలు వెళ్లాయి. దీంతో బుల్లబ్బాయి, లావణ్య, కూతురు హర్షిత అక్కడికక్కడే మృతి చెందారు. కొడుకు సిద్ధేశ్వర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సిద్ధేశ్వర్‌ను స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

- అవయవాలు దానంచేసిన కుటుంబ సభ్యులు
- మృతుడి అంత్యక్రియలకు రూ.90వేలు మంజూరు

కానిస్టేబుల్ ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

కందుకూరు, జనవరి 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతుడి అవయవాలను దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కందుకూరు పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పెద్దొళ్ల ప్రశాంత్‌రెడ్డి.. గత నెల 28న విధులను ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మలక్‌పేట్‌లోని యశోద వాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతుడి తండ్రి, మాజీ ఏఎస్సై నాగిరెడ్డి, భార్య సౌమ్యలు పెద్ద మనస్సుతో జీవన్‌దాన్‌కు మృతుడి కిడ్నీలు, కాలేయాన్ని దానం చేశారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధను గుండెల్లో దాచుకొని అవయవాలను దానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు. అవయవాలను దానం చేసినవారు భౌతికంగా మరణించినా జీవించి ఉన్నట్లేనని అన్నారు. కానిస్టేబుల్ ప్రశాంత్‌రెడ్డి అంత్యక్రియ ఖర్చులకు రూ.90వేలను సీపీ మంజూరు చేశారు. అంత్యక్రియల్లో సీఐ సీతారాం, సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, పోలీసులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్య

మియాపూర్, జనవరి 5 : గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ క్రాంతి వివరాల ప్రకారం..ఠాణా పరిధిలోని హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30-35) హత్యకు గురైనట్లు ఆదివారం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి తలపై సిమెంట్ ఇటుకతో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలోనే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడు ..5.5 అడుగులున్నాడని , తెల్ల చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు, బ్లాక్ జాకెట్ ధరించినట్లు సీఐ తెలిపారు. మృతుడి శరీరంపై కుడివైపునకు లవ్ సింబల్ ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మియాపూర్ ఠాణాలో సంప్రదించాలని సీఐ పేర్కొన్నారు.

అనుమతిలేకుండా తవ్విన రోడ్డు.. కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 5: జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా మంచినీటి కనెక్షన్ కోసం రోడ్డును తవ్విన ఇంటి యజమానిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ కర్నాటక బ్యాంక్ పక్క వీధిలో ఓ ఇంటి యజమాని ఇటీవల మంచినీటి కనెక్షన్ కోసం జలమండలి అనుమతి తీసుకున్నారు. అయితే.. జీహెచ్‌ఎంసీకి చెందిన రోడ్డును తవ్వేందుకు అనుమతి తీసుకోకుండానే సుమారు 1 మీటర్ వరకు ప్రధాన రోడ్డును తవ్వి పనులు చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సతీశ్ గట్టు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డును తవ్విన ఇంటి యజమానిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లోంచి డిజిల్ తస్కరణ

పీర్జాదిగూడ, జనవరి5: గుర్తుతెలియని దొంగలు నైట్‌హాల్ట్‌లో ఉన్న ఆర్టీసీ బస్సుల ట్యాంక్ తళాలు పగలగొట్టి డిజిల్‌ను తస్కరించారు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఆర్టీసీ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం....ఉప్పల్- ప్రతాపసింగారం రూటులో ప్రయాణించే ఉప్పల్ డిపోకు చెందిన నాలుగు బస్సులు రోజు మాదిరిగా ఘట్‌కేసర్ మండలం, ప్రతాపసింగారంలో నైట్‌హాల్ట్ చేస్తాయి. ఎప్పటిలాగే శనివారం రాత్రి కూడా బస్సులు నిలిపివేయగా.. తిరిగి ఆదివారం తెల్లవారు జామున రెండు బస్సుల డ్రైవర్లు ఉప్పల్ వైపు వెళ్లేందుకు స్టార్ట్ చేయగా స్టార్ట్ కాలేదు. కిందకు వెళ్లి చూడగా డిజిల్ ట్యాంక్‌ల తాళాలు పగలగొట్టి ఉన్నవి. సుమారు 150 లీటర్ల డీజిల్ దొంతనానికి గురైందని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'పరవస్తు' ఫౌండేషన్ ఉచిత ఆరోగ్య శిబిరం



నాగర్‌కర్నూల్ జిల్లా , సింగోటం గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మధుకర్ స్వామి

సిటీ బ్యూరో (నమస్తే తెలంగాణ), జనవరి 5 : పోలీసు ఉద్యోగాల కోసం ప్రతి ఏటా ఉచిత శిక్షణను అందించే పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్, కిమ్స్ దవాఖాన సికింద్రాబాద్, ఎల్వీప్రసాద్ కంటి వైద్యశాల కలిసిరాగా పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా సింగోటం గ్రామంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పరవస్తు మధుకర్ మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా గుండె, క్యాన్సర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, 30 ఏండ్లు దాటిన మహిళలు కచ్చితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కోసమే ప్రతి సంవత్సరం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్, కామినేని, ఎల్వీ ప్రసాద్ దవాఖానల నుంచి స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, న్యూరాలజీ, పల్మోనాలజీ, డెంటల్, కంటి విభాగాలతోపాటు, టూడీ, ఈసీహెచ్‌వో, ఈసీజీ, బోన్‌మాస్‌డెన్సిటీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఘటనలో ఏడుగురిపై కేసు

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు..కస్టడీకి తీసుకున్న పోలీసులు

పోలీసుల కస్టడీలో ఉన్న నిందితులు కిశోర్‌కుమార్, గోవింద్ కుమార్

మేడ్చల్, జనవరి 5: మేడ్చల్ జిల్లా, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల లేడీస్ హాస్టల్ ఘటనలో పోలీసులు విచారణ అనంతరం ఇద్దరు సిబ్బందితో పాటు ఇద్దరు వార్డెన్లు, యాజమాన్యానికి సంబంధించి ముగ్గురిపై.. మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం డీసీపీ కోటిరెడ్డి కథనం ప్రకారం.. కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాల లేడీస్ హాస్టల్‌లో డిసెంబర్ 31న రాత్రి స్నానాల గదిలోకి వెళ్లిన ఒక విద్యార్థినిని ఎవరో వెంటిలేటర్ నుంచి తొంగి చూస్తున్నట్టు గుర్తించారు. విద్యార్థినుల ఫిర్యాదు కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు.. విచారణ అనంతరం నిందితులను గుర్తించారు. బిహార్‌కు చెందిన నంద కిశోర్‌కుమార్(20), గోవింద్ కుమార్(20)లు హాస్టల్ కార్మికులుగా పని చేస్తూ వెనక భాగంలో కల్పించిన నివాస గృహాల్లో ఉంటున్నారు. విద్యార్థినులు స్నానాల గదిలో ఉండగా వారిద్దరు వెంటిలేటర్ ద్వారా చూసినట్టు ఒప్పుకున్నారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకున్నారు. ఈ ఘటనలో సరైన రీతిలో స్పందించనందుకు వార్డెన్లు కేవీ ధనలక్ష్మి, అల్లం ప్రీతిరెడ్డిలపై, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. బాలికలు, మహిళలకు విపత్కర పరిస్థితులు ఎదురైతే సహాయం కోసం 100 డయల్ చేయాలని లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 9490617444కు సమాచారం ఇవ్వాలని, వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, తగిన చర్యలు తీసుకుంటారని డీసీపీ కోటిరెడ్డి తెలిపారు.

కుల వ్యవస్థ భూతాన్ని అంతం చేస్తేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

చిక్కడపల్లి, జనవరి 5 : కుల వ్యవస్థ భూతాన్ని అంతం చేస్తేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్‌ఎం) 2వ మహాసభల ప్రారంభం సందర్భంగా ఆదివారం ఇందిరాపార్కు వద్ద బహిరంగ సభను నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం ఆధ్యక్షతన జరిగిన ఈ సభకు డి.రాజా హాజరై ప్రసంగించారు. భారత దేశంలో సామాజిక అభివృద్ధి, సంస్కరణలు, అభివృద్ధికి వేలాది ఏండ్లుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ భూతంగా మారిందన్నారు. కుల వ్యవస్థ భూతాన్ని అంతం చేస్తే దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. రాజ్యాంగ పరమైన పదవుల్లో ఉండి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన అమిత్ షా తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రూపొందించిన రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సమసమాజ స్థాపనతోనే అసమానతలు, నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఈ సభలో ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, బీకేఎంయూ జాతీయ ప్రధాన కర్యాదర్శి బోరియా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నర్సింహా, ఎం.బాలనరసింహా, ఏఐడీఆర్‌ఎం జాతీయ నేతలు సుబ్బారావు, శివకుమార్, రవీంద్ర చారి, చాయదేవి, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా నగరం పునరావిష్కరణకు ప్రయత్నాలు

ఫిబ్రవరిలో గిన్నీస్ బుక్ ఫీటుకు ఇట్స్ సిక్స్‌త్ వావ్ సంస్థ ఏర్పాట్లు

జై ద్వారకా క్యాంపేయిన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవీంద్రజిత్, తదితరులు

ఖైరతాబాద్, జనవరి 5 : శ్రీకృష్ణుడి రాజ్యం ద్వారకా నగరం పునరావిష్కరణకు ప్రయత్నాలు జరుగుతున్నా యి. ద్వారకా నగరం విశిష్టత, చారిత్రక సాక్ష్యాలు వెలుగులోకి తెచ్చేందుకు ఇట్స్ సిక్స్‌త్ వావ్ స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, చరిత్రకారుడు రవీంద్రజిత్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రాచీన ద్వారకా నగరంపై గత కొన్ని సంవత్సరాలుగా పరిశోధనలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా జై ద్వారకా క్యాంపేయిన్‌ను ప్రారంభించామన్నారు. ద్వారకా నగరాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని, గత ఏడాది డిసెంబర్ 21న వరల్డ్ సంకెన్ సిటీ డే సందర్భంగా కేంద్రం, గుజరాత్ ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖల సహకారంతో ఏడు మంది స్కూబా డైవర్స్‌తో సముద్రగర్భంలో, 70 మందితో సముద్రం వెలుపల శ్రీకృష్ణ జల జప దీక్ష నిర్వహించామని, అందుకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందన్నారు. ఫిబ్రవరి 17 ప్రపంచ గిన్నీస్ బుక్ రికార్డ్ ఫీటు చేయబోతున్నామని, ద్వారకా సముద్రం నీటిపై 700 మందితో జై ద్వారకా లోగోను ఆవిష్కృతం చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇట్స్ సిక్స్‌త్ వావ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు విన య్ పాత్రలే, జై ద్వారకా ప్రచార విభాగం ఆర్గనైజర్ షాహీ ఖాన్, అంతర్జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ మీనాక్షి పద్మనాభన్, ఇండియా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగా ణ చైర్మన్ కళాధర్ వల్లం, స్వర్ణ శ్రీ ఇంటర్నేషనల్ చైర్మన్ కిశోర్ పుల్ల , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సనాతన్ యోగ్‌పీఠ్ వ్యవస్థాపక దినోత్సవం

హరిద్వార్, జనవరి 5: సనాతన్ యోగ్‌పీఠ్ 30వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హరిద్వార్‌లోని పతంజలి వెల్‌నెస్‌లోని యోగా భవన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. పతంజలి యోగాపీఠం పరమాధ్యక్ష స్వామి స్వామీజీ మహరాజ్ వసుంధర బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 600 మందికి పైగా సనాతన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ గత 30 ఏండ్లుగా చేస్తున్న సేవలను వివరించారు. యోగాక్రాంతిలో విజయం సాధించిన మనం పంచ క్రాంతివైపు దృష్టి సారించాలన్నా రు. విద్య, వైద్య, ఆర్థిక, విద్యా-సాంస్కృతిక, మేధో పరమైన-భోగ-సంఘ-కలహాల నుంచి విముక్తి పొందే పెద్ద కార్యాన్ని ప్రారంభించాలని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యోగా ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని విశ్వసిస్తున్నారని చెప్పారు. కేరళలో కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రగతిశీల ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్‌కు హాజరైన విద్యార్థి నాయకులు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) 2025 క్యాలెండర్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. 'పంచ పరివర్తన్' థీమ్‌తో ముద్రించిన ఈ క్యాలెండర్‌ను చూసి కేంద్రమంత్రి అబ్బురపడ్డారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, తెల్కలపల్లి పెంటయ్య, భాస్కర్, నవీన్, శివ, బాల రాజు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 5: ప్రగతిశీల ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి 77వ జయంతి సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరం యువత శారీరక దృఢత్వం, అధ్యయనం వంటి పద్ధతులు పాటించేందుకు ప్రత్యేకంగా ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. వర్సిటీ విద్యార్థులు సమాజ మార్పునకు జార్జిరెడ్డి వంటి నేతలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఎన్. సుమంత్, కె.స్వాతి, వెంకటేశ్, అం జి, కోటేశ్వర్, శివకుమార్, ధనుశ్, సతీశ్, నవ్యశ్రీ, ప్రణీత, సంతోశ్, పవన్, ఆర్తి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

గంటల్లోనే గుర్తింపు..

- ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన చిన్నారి..
- సీసీ కెమెరాలతో గుర్తించి తల్లికి అప్పగించిన పోలీసులు

తప్పిపోయిన చిన్నారి, తల్లిదండ్రులతో పోలీసులు

చార్మినార్, జనవరి 5 : ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారి తప్పిపోగా.. ఫిర్యాదు అందిన గంటల్లోనే సీసీ కెమెరాలు జల్లెడపట్టి చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన భవానీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ బాల స్వామి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే హరిషయా బేగం కుమారుడు (4) ఆదివారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. గుర్తించిన బాలుడి తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ బాలస్వామి.. కేసును ఎస్సై నరేందర్‌కు అప్పగించి.. విచారణ వేగవంతంగా చేయడానికి మూడు టీంలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు జల్లెడపట్టి.. హర్షియాబేగం ఇంటి నుంచి కొంత దూరంలో చిన్నారిని గుర్తించారు. వెంటనే చిన్నారిని తీసుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చి తల్లికి అప్పగించారు. కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

మినర్వా హోటల్‌లో అగ్నిప్రమాదం



హిమాయత్‌నగర్, జనవరి 5: ప్రమాదవశాత్తు ఓ హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన నారాయణగూడ పోలీ స్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు, డీఎస్సై వెంకటేశ్ వివరా ల ప్రకారం.. హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న మినర్వా హోటల్‌లో ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. హో టల్‌లోని కిచెన్‌లో దట్టమైన పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. దీంతో హోటల్ సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం అం దించగా..వారు అగ్ని మాపక సిబ్బందిని పిలిపించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కిచెన్‌లో ఉన్న సామగ్రి, ఇతర వస్తువులు కాలిబూడిదైయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ సిబ్బంది భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-326616

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 25/01-కర్ణాటక; 18/02-కాశీ; 14/03-ముక్తినాథ్; 04/05-చార్‌ధామ్, 07/05-దో ధామ్, సరస్వతి పుష్కరాలు @ 9676637578, 9908844377. NT-326634

BUSINESS OFFER

★Wanted Investors for My Client: 1 Lakh to 1 Crore. Contact: A.M.Suree Goud. Legally, Safe, Secure & Dynamic Investment. Advisor, Advocate, Arbitrator & Legal Advisor. 9391665516, 8106826332. NT-337722

PLOT FOR SALE

★Bhongiri Yellamma Temple Opp. HMDA Villa Plots & Ghatkesar Two HMDA Villas "Low Cost". Cont: 9121830146, 9154270146. NT-326617

★Farm Plots for Sale: 3000 Per Sq.Yard, Near 400 Acres Govt. Sez, Kalwakurthy, Srisailam Highway. Ph: 7981200477. NT-326920

★శ్రీ బాలాజీ రెసిడెన్సీ @ కేశంపేట, షాద్‌నగర్ DTCP & RERA Aprvd. లేఔట్ Plots గజం @ 10,666/- (పండుగ ఆఫర్